సాక్షి వనపర్తి

శనివారం । 18 । నవంబర్ । 2023



స్థానిక సంస్థలు టు..
ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది స్థానిక సంస్థల్లో ఎన్నికై చట్టసభలకు వెళ్లారు.

వివరాలు 10లో ▸



భారీగా నగదు సీజ్
ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న పోలీసు తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /21.9

వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రి చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టు తనిఖీ



మదనాపురం: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టును శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. అంతకుముందు మండలంలోని దంతనూరు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కూలీలతో మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ అబ్రహం లింకన్ తదితరులు ఉన్నారు.

ప్రలోభాలకు గురికావొద్దు



పెబ్బేరు రూరల్: యువ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నచ్చిన అభ్యర్థికే ఓటు వేయాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి రాం మహేశ్వర్‌రెడ్డి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ ఆదేశాల మేరకు శుక్రవారం పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ, వీరభద్ర డిగ్రీ కళాశాలలో ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నేను నా ఓటును తప్పకుండా వినియోగించుకుంటాను' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లి కంటే దేశం చాలా గొప్పదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని వివరించారు. డీపీఆర్‌ఓ సీతారాంనాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, పౌరుల హక్కులతో పాటు బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్, వినోద్‌కుమార్, మిషన్‌శక్తి విభాగానికి చెందిన కౌన్సిలర్ శ్రీవాణి, సుమ, ఎఫ్‌ఆర్‌ఓ పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హస్తం గూటికి మందా జగన్నాథం



అలంపూర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం, ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ అలంపూర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మందా శ్రీనాథ్ కాంగ్రెస్ గూటికి చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్‌తో కలిసి మందా జగన్నాథం, మందా శ్రీనినాథ్‌లు శుక్రవారం రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఇలవేల్పునకు కానుక

పట్టువస్త్రాల తయారీలో అమరచింత పద్మశాలీలు



అమరచింత మార్కండేయ ఆలయ సత్రంలో పట్టువస్త్రాలు తయారు చేస్తున్న నేత కార్మికులు

- 15 రోజులు పాటు కొనసాగిన నేత పనులు
- నేడు అలంకారోత్సవంలో సమర్పణ

అమరచింత: పేదల తిరుపతి, భక్తుల పాలిట కొంగుబంగారమైన కురుమూర్తిరాయుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అలంకారోత్సవం నిర్వహించనున్నారు. అమరచింత పద్మశాలీ కులస్తులు తయారుచేసిన పట్టువస్త్రాలు అలంకారోత్సవం నాడు స్వామి, అమ్మవార్లకు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. 15 రోజులుగా పట్టువస్త్రాల నేత పనులు కొనసాగుతుండగా.. శనివారం భక్తి శ్రద్ధలతో ఆలయానికి తరలించేందుకు సర్వం సిద్ధం చేశారు. పట్టువస్త్రాలను అమరచింత నుంచి అమ్మాపురం ఆలయం వరకు తలపై పెట్టుకొని తీసుకెళ్లేందుకు ఆసక్తిగల పద్మశాలీల పేర్లలో లక్కీడీప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న తెలిపారు.

ఆనవాయితీగా..

అమరచింత పద్మశాలి కులస్తులు బ్రహ్మోత్సవాల సమయంలో వస్త్రాలు తయారు చేసి సమర్పించడం ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రారంభంలో నూలు వస్త్రాలు అందజేయగా.. కాలక్రమేణ పట్టు అందుబాటులోకి రావడంతో పట్టువస్త్రాలను తయారుచేసి స్వామివారికి పంచె, గౌను, అమ్మవారికి పట్టు చీరను ప్రత్యేక మగ్గంపై నేసి సమర్పిస్తున్నారు. కులస్తులందరూ భాగస్వాములై ప్రతి ఇంటి నుంచి విరాళాలు సేకరించి వస్త్రాల తయారీకి వినియోగిస్తారు.



స్వామి, అమ్మవార్ల పట్టువస్త్రాలు

గతంలో కోనేటిపై..

ఆరవై ఏళ్ల కిందట అమరచింత పద్మశాలి కులస్తులు బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి పుష్కరిణిలోనే నీటిపై డ్రమ్ములను ఏర్పాటు చేసుకొని మగ్గంపై వస్త్రాలు తయారుచేసి ఆలయ అర్చకులకు అందించి దేవస్థానం వారిచ్చే అతిథ్యాన్ని స్వీకరించేవారు. అప్పట్లో కోటకొండ కుర్మన్న, కొంగరి చిన్నయ్య, నరాల సింగోటం వస్త్రాలను నేసి స్వామివారికి సమర్పించేవారు.

నిష్టతో తయారీ..



స్వామివారి పట్టువస్త్రాలను ఉపవాస దీక్షతో నియమ నిష్టలతో తయారు చేస్తున్నాం. తయారీలో నాకు అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా.
– మక్త మల్లేష్, నేత కార్మికుడు, అమరచింత

ఎంతో పుణ్య ఫలం..



పద్మశాలి కులస్తులు ఏటా ఉత్సవాలకు స్వామి, అమ్మవార్ల పట్టువస్త్రాలు తయారు చేస్తున్నారు. దేవదేవుని సేవలో పాల్గొని తరించడం ఎంతో పుణ్యం చేసుకున్నట్లుగా ఉంది.
– దేవరకొండ వెంకటేశ్వరమ్మ, నేత కార్మికురాలు, అమరచింత

ఆనందంగా ఉంది..



కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు క్రమం తప్పకుండా పట్టువస్త్రాలు అందించడం అనాథిగా వస్తున్న ఆచారం. 16 ఏళ్లుగా పట్టువస్త్రాల నేత పనుల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది.
– దేవరకొండ లచ్చన్న, అధ్యక్షుడు, పద్మశాలి సంఘం

గజవాహనంపై దేవదేవుడు



తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజవాహన సేవ వైభవోపేతంగా నిర్వహించారు. కురుమతి రాయుడిని గజవాహనంపై ఆశీనులుగావించి స్వామివారి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు ప్రధాన మెట్ల గుండా ఊరేగించారు. స్వామివారిని చూసేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కురుమూర్తివాస గోవిందా.. గోవిందా అంటూ నామస్మరణ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కృష్ణయ్య, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల ఊరేగింపునకు పటిష్ట బందోబస్తు

ఆత్మకూర్: కురుమూర్తిస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే అలంకారోత్సవానికి సంబంధించిన ఆభరణాల ఊరేగింపునకు వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డితో పాటు ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 15 మంది ఏఎస్‌ఐలు, వంద మంది పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ కేఎస్ రత్నం తెలిపారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ లాకర్‌లో రూ.కోట్లు విలువజేసే స్వామివారి ఆభరణాలు భద్రపర్చారు. శనివారం ఉదయం 10.30 గంటలకు బయటకు తీసి ప్రత్యేక పూజల అనంతరం పరమేశ్వరస్వామి చెరువుకట్ట వరకు ఊరేగింపు కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, భక్తులు ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ నరేందర్ పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో పేరుగాంచిన కురుమూర్తిస్వామి జాతరను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని 9 డిపోల నుంచి శని, ఆది, సోమవారాల్లో 175 ప్రత్యేక బస్సులు నడపడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవాల రోజు ఆదివారం ఆయా డిపోల నుంచి 110 బస్సులు నడపనున్నారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈసారి కూడా కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి కోరారు.



డిపో	ప్రత్యేక బస్సులు
మహబూబ్‌నగర్	60
నాగర్‌కర్నూల్	38
వనపర్తి	30
గద్వాల	12
నారాయణపేట	10
కొల్లాపూర్	10
అచ్చంపేట	5
కల్వకుర్తి	5
షాద్‌నగర్	5

కాడెడ్ల నుంచి హస్తానికి



కోవర్టు రాజకీయం

పాలమూరుకు నిరుద్యోగ చైతన్యయాత్ర

వివరాలు 10లో ▸

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలి



నాగర్‌కర్నూల్‌లో అభ్యర్థులతో కలిసి అభివాదం చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- అయిజ, నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభలు

అలంపూర్/ నాగర్‌కర్నూల్ రూరల్: పొలాల్లో పంట మార్పిడి ఎలా చేస్తారో.. అలాగే రాజకీయాల్లోనూ అధికార మార్పిడి జరగాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బీఎస్పీ అభ్యర్థులకు మద్దతుగా జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా అయిజలో మాట్లాడుతూ బీఎస్పీ అభ్యర్థులు ఎవరూ శ్రీమంతులు కారని, కష్టార్జితాన్ని నమ్ముకొనే మీ ముందుకు వచ్చారన్నారు. వాళ్ల వలే ఓటుకు వెయ్యి ఇచ్చి, 90 ఎంఎల్ బాటిల్, ఇంటి వద్ద ఉచితంగా భోజనాలు పెట్టే వాళ్లు కాదన్నారు. కానీ, ఐదేళ్ల రోజుకు మూడు పూటల తిండిపెట్టే విధంగా మీ అందరినీ తయారు చేయడానికి వచ్చిన వారన్నారు. వాల్మీకులు, కుర్వ సోదరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఎంత మందికి టికెట్ ఇచ్చిందని ప్రశ్నించారు. బీఎస్పీ మహబూబ్‌నగర్, వనపర్తిలో వాల్మీకులకు టికెట్లు ఇచ్చినట్లు గుర్తుచేశారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్టీ రిజర్వేషన్ పెంచి వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్నారు. ఈ అలంపూర్ గడ్డలో పుట్టిన.. ఇదే తుంగభద్ర నీళ్లు తాగిన.. ఇదే నడిగడ్డ గాలి పీల్చిన.. ఇదే నడిగడ్డలో మొలకెత్తిన విత్తనాలు తిని పెరిగి ఈ స్థాయికి వచ్చానన్నారు. అలంపూర్, సిర్పూర్ బీఎస్పీకి రెండు కళ్లలాంటివని, తప్పకుండా రెండు చోట్ల గెలవాల్సిన అవసరం ఉందన్నారు.



నాగర్‌కర్నూల్‌లో సభకు హాజరైన బీఎస్పీ కార్యకర్తలు

బహుజనులు ఏకం కాలేరా?

నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేసినప్పుడు ఇక్కడి రెడ్డీలంతా ఒక్కటై ఆయన స్థానానికి ఎవరినీ పోటీ చేయించకపోవడం వారికున్న ఐక్యతను సూచిస్తుందని, అలాంటప్పుడు అత్యధిక జనాభా కలిగిన బహుజనులు ఒక్కటి కాలేమా అని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. రెడ్డీలు, దొరలు ఒక్కటేనని తెలంగాణలో దొరల పాలనతో అణచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. బీఎస్పీ అంటే కేవలం ఒక మతానికో, ఒక వర్గానికో, ఒక కులానికో చెందిన పార్టీ కాదని, రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను బహుజనులకే కేటాయించామని గుర్తు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక స్థానాన్ని బుడగ జంగాలకు, ఒక స్థానాన్ని దివ్యాంగులకు, ఒక స్థానాన్ని ఆరె కటికెలకు కేటాయించామని రాష్ట్ర వ్యాప్తంగా అదే పద్ధతిలో సీట్ల కేటాయింపు జరిగిందని వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లాలోని బీఎస్పీ అభ్యర్థులు అతికుర్ రహమాన్, మైబూస్ వాల్మీకి, సంతోష్‌రెడ్డి, గగనం శేఖరయ్య, శ్రీనివాస్‌యాదవ్, శివకుమార్, స్వప్న, వెంకటేశ్ చౌహాన్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ పార్టీ జిల్లా అధ్యక్షులు కేశవరావు, పృథ్వీ, నాయకులు దయానందరావు, విజయ్‌కుమార్, మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల సమీపంలోని మార్కెట్‌యార్డు గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలన్నారు. సిబ్బందికి అందించే కిట్లను ర్యాండమైజ్‌గా విధిగా పరిశీలించాలని, పోలింగ్ ఏజెంట్ హ్యాండ్‌బుక్, స్టేషనరీ కిట్, అడ్రస్ టాగ్స్, పోస్టర్లు, బ్యానర్ తదితర ఎన్నికల సామగ్రి సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని కోరారు. రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి పీఓ, ఏపీఓలు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అంతరాయాలు లేకుండా సామగ్రి అందించేలా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బందికి భోజన సదుపాయం, వాహనాల పార్కింగ్, రవాణాలో ఇబ్బందులు రాకుండా రూట్లవారీగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

పాలమూరుపై కాషాయ జెండా

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

పాలమూరు/ మహబూబ్‌నగర్ రూరల్: 'డిసెంబర్ 3 తర్వాత పాలమూరు గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలి. కారును బొంద పెట్టాల్సిన అవసరం ఉంది. బంగారు తెలంగాణను కేసీఆర్ బెల్టు దుకాణాల కేంద్రంగా మార్చారు. బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించి, మోదీ రాజ్యం తీసుకువచ్చే బాధ్యత పాలమూరు బిడ్డలపై ఉంది.' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. మీరు ఓటు వేసి గెలిపించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భూ కబ్జాలు, దందాలు చేస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయపెడుతున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటు వేస్తారా? లేకపోతే కష్టపడి పనిచేసే బీజేపీ అభ్యర్థికి అండగా ఉంటారో పాలమూరు ప్రజలే తేల్చుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డికి మద్దతుగా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని బొక్కలోనిపల్లి స్టేజీ వద్ద, జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలమూరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓటుకు రూ.10వేలు పంచేందుకు సిద్ధమైందని తెలిపారు. పాలమూరుకు కేసీఆర్ ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేదని, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు సైతం పూర్తి చేయలేదని విమర్శించారు. పాలమూరు యూనివర్సిటీకి నిధులివ్వకుండా, సిబ్బందిని నియమించకుండా పనికి రాకుండా చేశాడన్నారు. హిందూ సమాజమంతా ఏకం కావాలని, 80 శాతం ఓట్లతో హిందువుల సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మైనార్టీల నాశనం కోసం కేసీఆర్, ఓవైసీ ప్రయత్నిస్తే.. మోదీ ట్రిబుల్ తలాక్ రద్దు చేసి ఎంతో మేలు చేశారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 2.40 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే.. వాటిని ఎవరికి ఇచ్చారని మంత్రిని గల్లపట్టి ప్రశ్నించాలన్నారు. నీ డబుల్‌బెడ్‌రూంల సంగతి పక్కనపెట్టు.. ముందు మోదీ ఇచ్చిన ఇళ్లు మాకు ఇవ్వు అంటూ నిలదీయాలని సూచించారు. దౌర్జన్యాలు, భూకబ్జాలు, అరాచకాలు, అక్రమ కేసులు ధ్యేయంగా పెట్టుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, బాలరాజు, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, మీడియా ఇన్‌చార్జి సతీష్‌కుమార్, మండలాధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.



బండి సంజయ్‌ను గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి

ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో లేని ముఖ్య నేతలు

- కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీ మారిన నాగం
- గద్వాల, వనపర్తిలో పోటీ నుంచి తప్పుకున్న డీకే అరుణ, చిన్నారెడ్డి
- ఇతర అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

తప్పుకున్న సీనియర్లు..

సాక్షి, నాగర్‌కర్నూల్: దశాబ్దాల పాటు రాజకీయ అనుభవం ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని సీనియర్ రాజకీయ నేతలు ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల పాటు ఎన్నికల పోరులో తలపడుతూ వచ్చిన పలువురు రాజకీయ ఉద్దండులు ఈసారి అనూహ్యంగా ఎన్నికల పోటీ నుంచి నిష్క్రమించడం గమనార్హం. మారిన పరిస్థితులకు అనుగుణంగా వీరంతా ఎన్నికల్లో నిలిచిన ఇతర అభ్యర్థులకు మద్దతుగా ఉంటూ ప్రచారం ముందుకు దూసుకెళ్తున్నారు.


పోటీకి దూరంగా గద్వాల జేజమ్మ



గద్వాల ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన డీకే అరుణ ఈసారి ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోగా.. సమజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా 2004 ఎన్నికల్లో బరిలో నిలిచి గెలుపొందారు. అనంతరం 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కాగా, అనంతరం బీజేపీలో చేరారు. ఆపార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. అయితే అనూహ్యంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆమె దూరంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకే ఇప్పుడు బరి నుంచి తప్పుకున్నట్లు ప్రచారం సాగుతోంది.


చివరి నిమిషంలో చిన్నారెడ్డి..

ఏఐసీసీ కార్యదర్శిగా కొనసాగుతున్న జిల్లెల చిన్నారెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించారు. వనపర్తి నియోజకవర్గం నుంచి 1989, 1999, 2004, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో సైతం ఆయనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటించినా చివరి నిమిషంలో అభ్యర్థిత్వంలో మార్పు చేసింది. ఆయన స్థానంలో మరో నేత మేఘారెడ్డికి టికెట్ ఖరారు చేసింది. దీంతో ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికల బరి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు, నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో వెలుగొందిన నేతలు ప్రస్తుత ఎన్నికల్లో అనూహ్యంగా బరి నుంచి తప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది.



కందనూలు పోరుకు నాగం వీడ్కోలు..


నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 1983 నుంచి సుమారు 40 ఏళ్లుగా ఎన్నికల బరిలో నిలుస్తూ వచ్చిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఈసారి పోటీ నుంచి తప్పుకున్నారు. 1983లో వైద్యరంగం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాగం కందనూలుతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు. టీడీపీ అభ్యర్థిగా 1985, 1994, 1999, 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. 2012 ఉపఎన్నికలోనూ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఈ క్రమంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సేవలందించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన ఆయనకు భంగపాటు తప్పలేదు. ఈ అనూహ్య పరిణామానికి కలత చెందిన నాగం కాంగ్రెస్‌ను వీడి, బీఆర్‌ఎస్‌లో చేరి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. కొల్లాపూర్‌లో మరో కాంగ్రెస్ నేత చింతలపల్లి జగదీశ్వరరావు ఈసారి ఎన్నికల బరి నుంచి వైదొలిగారు. 2009లో టీడీపీ నుంచి బరిలో ఉన్న ఆయన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావుపై 1508 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. అనంతరం 2012 ఉప ఎన్నికల్లోనూ టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఈసారి కాంగ్రెస్ టికెట్ ఆశించగా, జూపల్లి కృష్ణారావుకు కేటాయించడంతో జగదీశ్వరరావు పోటీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది.





ఒక గొప్ప వ్యక్తికి, ప్రముఖ వ్యక్తికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. గొప్ప వ్యక్తి ఎల్లప్పుడూ సమాజ సేవకు సిద్ధంగా ఉంటాడు.
- డా.బీఆర్ అంబేడ్కర్

కాడెడ్ల నుంచి.. హస్తానికి..



దేశంలో తొలి ఎన్నికల నుంచి పరిశీలిస్తే.. రాజకీయ పార్టీల గుర్తుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తు కాడెడ్లు. ఈ గుర్తుతోనే దేశమంతా ఎన్నికల బరిలో నిలిచారు. ఆ తర్వాత పార్టీ చీలి కాంగ్రెస్ (ఇందిర) ఏర్పాటు కావడంతో దీనికి 'ఆవుదూడ' గుర్తు కేటాయించారు. ఇదే గుర్తుతో 1971 ఎన్నికల్లో పోటీ చేశారు. తర్వాత చీలిపోయిన కాంగ్రెస్.. తిరిగి విలీనమై భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) పేరుతో ఏర్పడటంతో 'హస్తం' గుర్తును కేటాయించారు. 1977 నుంచి హస్తం గుర్తుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

పీడీఎఫ్‌కు మొదట్లో హస్తం..: 1952 సార్వత్రిక ఎన్నికల సమయంలో కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం ఉండటంతో పీడీఎఫ్ పేరుతో బరిలో నిలవగా, హస్తం గుర్తును కేటాయించారు. ఆ తర్వాత సీపీఐకి కంకి కొండవలి, సీపీఎంకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తులను కేటాయించడంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

- అచ్చంపేట

స్థానిక సంస్థలు టు చట్టసభలు





- ఉమ్మడి జిల్లాలో అంచెలంచెలుగా ఎదిగిన నేతలు
- జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులుగా రాణింపు

గద్వాల రూరల్: ప్రస్తుతం కొడితే సిక్స్ కొట్టాలనే తరహాలో కొందరు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా నేరుగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. దశాబ్దం కిందటి వరకు చాలా మంది నాయకులు తమ ప్రస్థానాన్ని స్థానిక సంస్థల పదవులతో ప్రారంభించి.. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులుగా రాణించారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డీకే భరత్‌సింహారెడ్డి, డీకే అరుణ, సీతాదయాకర్‌రెడ్డి, గట్టు భీముడు వంటి నేతలు ఆ కోవలోకే వస్తారు. వీరంతా కూడా తమ రాజకీయ ప్రస్థానాన్ని సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ పదవులతో ప్రారంభించారు.

డీకే భరత్‌సింహారెడ్డి..



గద్వాలకు చెందిన డీకే భరత్‌సింహారెడ్డి 1983 మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలుపొంది, 1988 వరకు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి తన సోదరుడు డీకే సమరసింహారెడ్డిపై విజయం సాధించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కీలక నేతగా పనిచేశారు.

డీకే అరుణ..



గద్వాలకు చెందిన డీకే అరుణ 2001లో కొల్లాపూర్ నియోజకవర్గం పాన్‌గల్ మండలం నుంచి జెడ్పీటీసీగా గెలుపొందారు. 2004 ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో డీకే అరుణ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించి ఫైర్ బ్రాండ్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి, బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. 2019లో బీజేపీలో చేరి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందారు. ప్రస్తుతం ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.

ఎనుముల రేవంత్‌రెడ్డి..



వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి చెందిన పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి సైతం రాజకీయ ప్రస్థానాన్ని స్థానిక సంస్థల నుంచే ఆరంభించారు. 2007లో మిడ్జిల్ మండలం నుంచి జెడ్పీటీసీగా పోటీచేసి గెలుపొందారు. 2009లో కొడంగల్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో కూడా కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొంది శాసనసభ పక్ష నేతగా అధికార పక్షం బీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చారు. అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి బరిలో నిలిచి గెలుపొందారు. మరోవైపు పార్టీలో అనతి కాలంలోనే అంచెలంచెలుగా ఎదిగి పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి..



గద్వాల నియోజకవర్గంలోని ధరూరు మండలం బూరెడ్డిపల్లికి చెందిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రాజకీయ ఓనమాలను తన మేనమామ డీకే భరత్‌సింహారెడ్డి వద్ద నేర్చుకున్నారు. డీకే బంగ్లాలో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. కాలక్రమేణా డీకే కుటుంబంతో ఏర్పడిన రాజకీయ విభేదాలతో 2004లో టీడీపీలో చేరారు. 2006లో గద్వాల జెడ్పీటీసీగా పోటీచేసి గెలుపొందారు. 2009లో గద్వాల నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి డీకే అరుణ చేతిలో ఓటమిపాలయ్యారు. తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో వైఎస్సార్ పార్టీలో చేరారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం టీఆర్ఎస్‌లో చేరి 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి మరోమారు ఓటమి చెందారు. 2018లో జరిగిన ఎన్నికల్లో డీకే అరుణపై గెలుపొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి ఎన్నికల బరిలో నిలిచారు.

సీతాదయాకర్‌రెడ్డి..



1994లో రాజకీయాల్లోకి వచ్చిన సీతాదయాకర్‌రెడ్డి టీడీపీలో చేరారు. 2001లో దేవరకద్ర జెడ్పీటీసీగా గెలుపొంది, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా 2006 వరకు కొనసాగారు. 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దేవరకద్ర సెగ్మెంట్ నుంచి టీడీపీ తరఫున బరిలో నిలిచి విజయం సాధించారు. అదే సమయంలో తన భర్త దయాకర్‌రెడ్డి కూడా మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో శాసనసభ చరిత్రలో తొలిసారిగా దంపతులిద్దరూ ఎమ్మెల్యేలుగా అడుగుపెట్టారు. ఇటీవల ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి..



నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1981నుంచి 1991 వరకు తూడుకుర్తి సర్పంచ్‌గా, 1991నుంచి 1996 వరకు ఎంపీపీగా పనిచేశారు. 2006లో నాగర్‌కర్నూల్ జెడ్పీటీసీగా గెలుపొంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

ఆల వెంకటేశ్వర్‌రెడ్డి..



భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు చెందిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మొదట టీడీపీలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. భూత్పూర్ జెడ్పీటీసీగా గెలుపొందిన అనంతరం 2014లో టీఆర్ఎస్‌లో చేరారు. దేవరకద్ర సెగ్మెంట్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతూ మరోసారి దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

గట్టు భీముడు..



గట్టు మండలం బలిగెర గ్రామానికి చెందిన గట్టు భీముడు అలియాస్ బాసు భీమయ్య 1995లో జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1999లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2004, 2009 ఎన్నికల బరిలో నిలిచి ఓటమి చెందారు. తర్వాత టీఆర్ఎస్‌లో చేరి తన తుదిశ్వాస వరకు పార్టీలో కొనసాగారు. 2018లో ఆయన మరణించారు.

ఎన్నికల సిత్రాలు..

ఓట్లు 'దోశే'ద్దాం!



మహబూబ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో గల ఓ టిఫిన్ సెంటర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దోశలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు.
- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

హారతి పట్టి.. అభయమిచ్చి..



మక్తల్ బీజేపీ అభ్యర్థి జలంధర్ రెడ్డి కృష్ణా మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు హారతులు పట్టారు.
- కృష్ణా

కూలీలతో కలిసి.. ఇసుక ఎత్తి..



కోడేరు మండలం తీగలపల్లిలో బీఆర్ఎస్ కొల్లాపూర్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ కూలీలతో కలిసి ఇసుక ఎత్తి ఓటర్లను ఆకట్టుకున్నారు.
- కోడేరు

చాటలో బియ్యం.. ఈవీఎంలో ఓట్లు



కాంగ్రెస్ పార్టీ అలంపూర్ అభ్యర్థి సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి రాజోళి మండలం ముండ్లదిన్నెలో మహిళలతో కలిసి బియ్యం శుద్ధి చేస్తూ ఓట్లను అభ్యర్థించారు.
- రాజోళి

పాలమూరుకు నిరుద్యోగ చైతన్య యాత్ర



మాట్లాడుతున్న నిరుద్యోగ చైతన్య యాత్ర ప్రతినిధి

స్టేషన్ మహబూబ్‌నగర్: నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర శుక్రవారం పాలమూరు జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా నిరుద్యోగ చైతన్య యాత్ర ప్రతినిధులు, యువత, కాంగ్రెస్ కార్యకర్తలు న్యూటౌన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం నిరుద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగాలు కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నో వ్యయప్రయాసలతో పోటీ పరీక్షలకు సన్నద్ధమైతే పేపర్ లీకేజీలతో యువత జీవితాలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిస్వాల్ కమిటీ నివేదికను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలోని 40లక్షల మంది నిరుద్యోగ యువత ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ఇటు నగదు.. అటు లిక్కర్ సీజ్



వెల్టూరు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో ఎస్‌ఐ హరిప్రసాద్


పెబ్బేరు రూరల్/కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5,06,457 నగదుతో పాటు 39.18 లీటర్ల లిక్కర్ పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పెబ్బేరు మండలం రంగాపురం చెక్‌పోస్టు వద్ద రూ.3లక్షల 2వేలు, వనపర్తి పట్టణంలో రూ.1,34,457, పెద్దమందడి మండలం వెల్టూర్ చెక్‌పోస్టు వద్ద రూ.70వేల నగదు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆత్మకూర్ మండలంలో 12.60 లీటర్లు, శ్రీరంగాపురం మండలం వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద 17.28 లీటర్లు, కొత్తకోట మండలంలో 9.3 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

నారాయణపేట రూరల్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఒకవైపు నగదు, మరోవైపు లిక్కర్ పట్టుబడినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మక్తల్‌లో రూ.లక్ష, దామరగిద్దలో రూ.60,900, నారాయణపేటలో రూ.లక్ష 50వేలతో కలిపి మొత్తం రూ.3,10,900 నగదు పట్టుకున్నట్లు వెల్లడించారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా నారాయణపేటలో 43 లీటర్లు, మద్దూర్‌లో 45.06 లీటర్లు, దామరగిద్దలో 20.34 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఎవరైనా రూ.50వేలకు మించి నగదు, మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని కోరారు.

కోవర్టు రాజకీయం!

ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు అభ్యర్థుల ఎత్తుగడ

- ప్రత్యర్థి పార్టీ నేతల చేరికపై నజర్
- ప్రధాన పార్టీల్లో మారుతున్న కండువా
- అన్ని నియోజకవర్గాల్లోనూ అదే తీరు



అచ్చంపేట: పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు.. ఎన్నికల్లో అభ్యర్థి గెలవాలన్నా, ఓడాలన్నా వారి కృషి మీదే ఆధారపడి ఉంటుంది. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం 10మంది పార్టీలో చేరితే చాలు ఓట్లు పడతాయనే ధోరణిలో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు. ఇదే అదునుగా పార్టీలో చేరే కార్యకర్తలు నాయకులతో ఏకంగా క్యాష్ డీల్ కుదుర్చుకుంటూ కండువాలు మారుస్తున్నారు. ఈ తరహా వ్యక్తులు పార్టీలో నిబద్ధతగా పని చేస్తారనే నమ్మకం లేదు. వేరే నాయకుడు ప్రలోబపెడితే ఆ పార్టీలోనూ చేరే రకం వీరిది. ఇదంతా ఒక ఎత్తయితే.. కొందరు నేతలు ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థుల ఎత్తుగడలను తెలుసుకునేందుకు తమ అనుచరులను కోవర్టులా ఇతర పార్టీల్లోకి పంపుతున్నారు.

చేరికల గోల..

ఓటర్లను తమవైపు ఎలా మలుపుకోవాలన్న దానిపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే గంటల వ్యవధిలోనే ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారుతున్నారు.పెద్ద సంఖ్యలో చేరికలతో తమకు కలిసి వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నప్పటికీ కొత్త తలనొప్పులు తప్పడం లేదు. తమను సంప్రదించకుండానే కొత్త వారిని ఎలా చేర్చుకున్నారంటూ మొదటి నుంచి పార్టీలో పని చేస్తున్న నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గిట్టని వారిని పార్టీలో చేర్చుకోవడం ఏంటని నిలదీస్తున్నారు. అలాంటి వారంతా పార్టీ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు.

బలహీన పరచడమే లక్ష్యం..

ఎదుటి వారిని బలహీనపరచడమే అసలు లక్ష్యంగా అభ్యర్థులు, ఆశావాహులు పావులు కదుపుతున్నారు. ఇందుకు కలిసి వచ్చే ఏ ఒక్క అంశాన్ని వదలి పెట్టడంలేదు. పార్టీలో చేరుతామని సమాచారమందిన వెంటనే హుటాహుటిన అక్కడికెళ్లి వాలిపోతున్నారు. ఆ వెంటనే కండువాలు కప్పేస్తున్నారు. ముందస్తు ముచ్చట మొదలైనప్పటి నుంచే ఆయా నియోజకవర్గాల్లో ఎంతో మంది కండువాలు మార్చేశారు. ఎదుటి పార్టీని బలహీనం చేయడంతోనే తమ గెలుపు ముడిపడి ఉందని కొందరు భావించి చేరికలను ప్రోత్సహిస్తున్నప్పటికీ.. సొంత పార్టీలో కొత్త అలకలు మొదలవుతున్నాయి. కొత్త చేరికలతో కోవర్టుల బెడద పెరిగిపోయి అసలుకే మోసం వస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆచితూచి అడుగులు వేయకుంటే గెలుపోటములపై ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఉన్న క్యాడర్‌ను కాపాడుకోగలిగితే విజయావకాశాలు మెరుగుపడే అవకాశముందని, ఆ దిశగా ఆలోచించాలని సూచిస్తున్నారు.

ప్రధాన పార్టీల్లోనే అధికం...

ఎన్నికల నేపథ్యంలో కొన్ని రోజులుగా ప్రధాన పార్టీల్లో చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్‌ను వదలి కాంగ్రెస్‌లోకి.. కాంగ్రెస్‌ను వదలి బీఆర్ఎస్‌లోకి చేరే వారే ఎక్కువగా ఉంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు నచ్చని వారు బీజేపీలోకి జారుకుంటున్నారు. పార్టీ అధికారంలోకి వస్తుందా.. అభ్యర్థులు గెలిచే అవకాశముందా.. పార్టీ మారిన తమకు ఏమైనా కలిసి వస్తుందా.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఆర్థికంగా ఏ మేరకు బలంగా ఉన్నారు.. ఇలాంటివి చూసుకొని గోడ దూకుతున్నట్లు తెలుస్తోంది. కొందరు స్వచ్ఛందంగా పార్టీలు మారుతుండగా.. మరికొందరు స్థానిక సమస్యలు, భవిష్యత్ పరిణామాలను అంచనా వేసుకుంటూ జంప్ చేస్తున్నారు. ఇన్నాళ్లు నేతలపై కసితో ఉన్న అసమ్మతి నాయకులంతా జంపింగ్‌లతో అభ్యర్థులను శాసిస్తున్నారు. ఏదో రకమైన సాకుతో పార్టీ మారుతున్నామని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు.

సహాయకులుగా ఒకరికి ఒక్కసారే అవకాశం..

ఈ నెల 30వ తేదీన జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, అంధులకు సహాయకులుగా ఉండడానికి ఒక్కరికి ఒక్కసారే అవకాశం ఉంది. సహాయకులుగా వెళ్లే వారికి కూడా అధికారులు సిరా చుక్క గుర్తు వేస్తారు. దీనివల్ల వారు తిరిగి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. కాగా, ఓటర్లకు ఎడమ చూపుడు వేలికి సిరా చుక్క గుర్తు వేస్తున్న విషయం తెలిసిందే. సహాయకుడికి మాత్రం కుడిచేయి చూపుడు వేలుకు సిరా చుక్క గుర్తు వేస్తారు.

- మహబూబ్‌నగర్ డెస్క్

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని పాలమూరు యూనివర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బషీర్ అహ్మద్, వ్యాయామ విద్య అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 విభాగాల బాల, బాలికల జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నిరంతరం క్రీడలను ప్రాక్టీస్ చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధి సాదత్‌ఖాన్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, పీడీలు పరశురాం, వడెన్న, పీఈటీలు బాలరాజు, నిరంజన్‌రావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE

■ Clear Title Dry Agricultural Land two acres for sale Pothepally village, Veldanda Mandal, Kalwa kurthy Divison, Nagar kurnool District.Single Payment Transaction. No Brokers serious buyers with Available funds may send their offer on Whatsapp. documents will be shown to shortlisted buyer Contact : 8712202596

SERVICES

DOCUMENT MISSING

■ I, Habeebuddin Ahmed S/o Nayeemuddin, R/o H.No 3-6-89, John mohd street, Mahabubnagar Town and Dist.T.S. I have lost my orginal Regd. Doct.No. 1261/1997 .plot no.93 while I was traveling on my Bike from clock tower to district jail on 10-11-2023.If anyone found please contact to me on:8333863337

■ I, Mohd Mujeebuddin Ahmed S/o Nayeemuddin, R/o H.No 3-6-89, John mohd street, Mahabubnagar Town and Dist.T.S. I have lost my orginal Regd. Doct.No. 1262/1997 .plot no.83 while I wastraveling on my Bike from clock tower to district jail on 10-11-2023.If anyone found please contact to me on:8333863337

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665

WANTED

■ 10th, INTER, డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) అయిన స్త్రీ/పురుషు మా కంపెనీలో పని చేయుటకు కావలెను. జీ.14వేలు+DA 6వేలు+ఫ్రీ రూం, నో ఫీజు. మహబూబ్‌నగర్. 99632 80512.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

■ Hyderbad లోని Zepto కంపెనీలో పనిచేయుటకు డెలివరి బాయ్స్ / గర్ల్స్ కావలెను. జీతం + బైక్ + హాస్టల్ వసతి కూడా కలదు. సంప్ర॥ 89190 15932

■ REQUIRED CIVIL CONTRACTORS IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234

HAPPY BIRTHDAY
సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST కూడా అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ దంపతులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



కుటుంబ సభ్యులతో జస్టిస్ వినోద్ కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

19న తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19న పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. 19న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ, 19న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



34 లక్షల ఎకరాలపై పేదలకు హక్కులు

- చరిత్రను తిరగరాస్తూ సామాజిక భూ హక్కులు
- నూజివీడు బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్
- దశాబ్దాల అనుభవదారులను చట్టబద్ధంగా హక్కుదారులను చేశాం
- ఇది చరిత్రలో గొప్పగా నిలిచిపోయే రోజు
- 42,307 మందికి కొత్తగా 46,463.82 ఎకరాల డీకేటీ పట్టాల పంపిణీ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



లబ్ధిదారుకు భూ పట్టా అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములపై పేదలకు సర్వ హక్కులు కల్పిస్తోంది మీ బిడ్డ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలు, రైతుల గుండె చప్పుడు విన్నది కాబట్టే మనందరి ప్రభుత్వం దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వారికి భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ మనస్ఫూర్తిగా మంచి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 35,44,866 ఎకరాలకు సంబంధించి 20,24,709 మంది పేదలకు హక్కులు కల్పించి ఆ భూములను మీ బిడ్డ ప్రభుత్వం వారి చేతుల్లో పెడుతోందన్నారు. మనందరి ప్రభుత్వంలో సామాజిక న్యాయమన్నది ఒక నినాదంగా కాకుండా ఒక విధానంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద వర్గాలను అక్కున చేర్చుకుని సామాజిక, ఆర్థిక న్యాయం చేయగలిగామన్నారు. ప్రతి పేదవాడు కాలర్ ఎగరవేసి అదిగో మా అన్న ప్రభుత్వం.. మా ప్రభుత్వం.. మా కోసం ఆలోచన చేసే వాడు ఒకడు ఉన్నాడు అని చెప్పుకునే విధంగా పాలన సాగిందని చెప్పేందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46,463.82 ఎకరాల భూమిని 42,307 మందికి కొత్తగా డీకేటీ పట్టాలు పంపిణీ చేసే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దశాబ్దాలుగా అనుభవదారులుగా ఉన్న పేద రైతులకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడంతోపాటు చుక్కల భూముల సమస్యకు సైతం పరిష్కారాన్ని చూపామన్నారు. దళితుల శ్మశాన వాటికల కోసం 1,563 గ్రామాల్లో 951 ఎకరాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. 2003 నాటి అసైన్డ్ భూములపై హక్కులు, కొత్తగా డీకేటీ పట్టాలను అందిస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తుంటే పెత్తందారులకు నచ్చడం లేదని మండిపడ్డారు. పేద వర్గాల పట్ల బాధ్యతగా, చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంటే ప్రతిపక్షం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదలకు భూ పంపిణీ, అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు, లంక భూములకు పట్టాలు, చుక్కల భూములు, షరతు గల పట్టా భూములు, సర్వీస్ ఈనాం భూములు 22 (ఏ) నుంచి తొలగింపు, భూమి కొనుగోలు పథకం ద్వారా అందించిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. భూములకు సంబంధించి కేవలం 53 నెలల వ్యవధిలో తీసుకున్న తొమ్మిది రకాల విప్లవాత్మక నిర్ణయాలతో పేదలు, రైతన్నలకు చేకూర్చిన మేలును వివరిస్తూ ఆయా అంశాలను సీఎం జగన్ ప్రస్తావించారు.

ప్రపంచంలోనే అతి పెద్దది..

ఏపీలో ఎలక్ట్రిక్ వాహన యూనిట్

- జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రకటన
- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం.. పుంగనూరులో యూనిట్
- రూ.4,640 కోట్ల పెట్టుబడి.. 8,080 మందికి ఉపాధి
- ఈ నెలాఖరులో పనులు ప్రారంభం.. 2025కి వాణిజ్య ఉత్పత్తి మొదలు




సాక్షి, అమరావతి: జర్మనీకి చెందిన ప్రముఖ విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ప్రపంచంలోనే అతిపెద్ద తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తోంది. చైనా వెలుపల ఈ స్థాయిలో భారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరినట్లు పెప్పర్ మోషన్ జీఎంబీహెచ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ భారీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా పుంగనూరులో 800 ఎకరాలు కేటాయించడంతో పాటు పలు రాయితీలను ఇచ్చింది. సుమారు రూ.4,640 కోట్లు (600 మిలియన్ అమెరికన్ డాలర్లు) పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 8080 మందికి ఉపాధి లభిస్తుంది. టెస్లా మాదిరి అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత ఎలక్ట్రిక్ బస్ అండ్ ట్రక్ తయారీ యూనిట్‌తో పాటు డీజిల్ బస్సులు, ట్రక్కులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రిట్రో ఫిట్టింగ్, 20 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే బ్యాటరీ తయారీ యూనిట్, విడిభాగాల తయారీ యూనిట్లు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. పరిశ్రమలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహం, ఆయన తీసుకుంటున్న ప్రగతిశీల ఆర్థిక విధానాలకు తోడు పోర్టులు, పారిశ్రామిక మౌలిక వసతులు పెద్ద ఎత్తున సమకూరుస్తుండటంతో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు పెప్పర్ మోషన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆండ్రియాస్ హేగర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2025 నాటికి ఉత్పత్తి ప్రారంభం

ఈ నెలాఖరులో యూనిట్ నిర్మాణం ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. 2025 ప్రారంభం నాటికి వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. 2027 నాటికి ఏటా 50,000 కంటే ఎక్కువ బస్సులు, ట్రక్కులు తయారు చేసే సామర్థ్యానికి యూనిట్ చేరుకుంటుందని వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలను కూడా ఇక్కడే ఉత్పత్తి చేసి, అంతర్జాతీయంగా సరఫరా చేయనున్నట్లు తెలిపింది.

బోగస్ ఇన్వాయిస్‌లతో 'స్కిల్' నిధులు స్వాహా

- చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తానే పాత్రధారి
- ఆయన చెబితేనే వాటిని ఇచ్చా..
- పూర్తి కుట్రను వెల్లడిస్తా.. అప్రూవర్‌గా అనుమతించండి
- న్యాయస్థానంలో ఏసీఐ ఎండీ చంద్రకాంత్ షా పిటిషన్
- స్కిల్ కుంభకోణం కేసులో కీలక మలుపు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టిన 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కుంభకోణం కేసు కీలకమలుపు తిరిగింది. షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా చంద్రబాబు ముఠా అడ్డగోలుగా నిధులను అక్రమంగా తరలించారన్నది స్పష్టమైంది. ఈ బాగోతంలో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా మొత్తం అవినీతి నెట్‌వర్క్‌ను వెల్లడిస్తూ వాంగ్మూలం ఇచ్చారు. స్కిల్ స్కాం కేసులో నిందితుడు (ఏ–13)గా ఉన్న ఆయన తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ స్కాంలో బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా నిధులను ఎలా కొల్లగొట్టిందీ వివరిస్తూ ఆయన గతంలోనే గుంటూరులోని న్యాయస్థానంలో 2022, జులై 23న 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చారు. తాజాగా.. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారి స్కిల్ స్కాంలో సూత్రధారులు, పాత్రధారులు, తెరవెనుక కుట్రను వెల్లడించేందుకు ఆయన స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అందుకోసం తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించి తనను ఈ కేసులో సాక్షిగా పరిగణించాలని కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో చంద్రకాంత్ షాను సీఐడీ గతంలో అరెస్టుచేయగా ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.

యోగేశ్ గుప్తానే కథ నడిపారు..

ఇక ఈ కేసులో చంద్రబాబు సన్నిహితుడు యోగేశ్ గుప్తా పాత్ర మరోసారి బయటకొచ్చింది. అమరావతిలో తాత్కాలిక సచివాలయ భవనాలు, టిడ్కో ప్రాజెక్టు కాంట్రాక్టుల కేటాయింపులో నిర్మాణ సంస్థల నుంచి ముడుపులు వసూలుచేసి చంద్రబాబుకు చేరవేయడంలో యోగేశ్ గుప్తా పాత్రధారిగా ఉన్నారు. అందుకే ఈయనకు ఐటీ శాఖ కూడా నోటీసులిచ్చి విచారించింది. అలాగే, స్కిల్ స్కాం కేసులోనూ యోగేశ్ గుప్తా నిందితుడుగా (ఏ–22) ఉన్నారు. నిధుల అక్రమ తరలింపులో ఈయన కీలకపాత్ర పోషించారని చంద్రకాంత్ షా తన అప్రూవర్ పిటిషన్‌లో వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడు సావన్ కుమార్ జజు (ఏ–26)తో కలిసి యోగేశ్ గుప్తా 2016లో ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షాను సంప్రదించారు. డిజైన్‌టెక్, స్కిల్లర్ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సమకూర్చినట్లు.. ఐటీ సేవలు అందించినట్లుగా బోగస్ ఇన్వాయిస్‌లు కావాలని కోరారు. అనంతరం.. ఏసీఐ కంపెనీ పేరిట స్కిల్లర్ కంపెనీకి 18 బోగస్ ఇన్వాయిస్‌లు, డిజైన్‌టెక్ కంపెనీకి రెండు బోగస్ ఇన్వాయిస్‌లు ఇచ్చారు. సీమెన్స్–డిజైన్‌టెక్ కంపెనీలతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఒప్పందం కుదుర్చుకున్నట్లు.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు నమ్మించేందుకే బోగస్ ఇన్వాయిస్‌లు తమ నుంచి తీసుకున్నట్లు తాను గుర్తించానని చంద్రకాంత్ షా పేర్కొన్నారు. ఈ బోగస్ ఇన్వాయిస్‌ల విలువ మేరకు రూ.64,87,39,313 ఏసీఐ కంపెనీ బ్యాంకు ఖాతాలో జమచేశారు. అనంతరం సావన్‌కుమార్ చెప్పిన పలు షెల్ కంపెనీలకు ఆ నిధులను చంద్రకాంత్ షా బదిలీ చేశారు. మరోవైపు.. స్కిల్ స్కాం నిధులు రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు సీఐడీ తాజాగా గుర్తించింది. ఇందులో రూ.64.87 కోట్లు ఏసీఐ కంపెనీ బోగస్ ఇన్వాయిస్‌లతోనే అక్రమంగా తరలించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. చంద్రకాంత్ షా అప్రూవర్ పిటిషన్‌పై విచారణకు డిసెంబర్ 5న హాజరుకావాలని న్యాయస్థానం ఆయన్ని ఆదేశించింది. దాంతో స్కిల్ స్కాం దర్యాప్తులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

అలంపూర్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఇమాంపురం శివారులోని అలంపూర్ ప్రధాన రోడ్డుపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. అలంపూర్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు కర్నూల్‌కు ఆటోలో బయల్దేరారు. ఇమాంపురం దాటిన తర్వాత ఆటో ముందు టైర్ ఊడిపోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న పెద్ద బీసన్న, రవి, చిట్టెమ్మ, మాధవి ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ముగ్గురిని అంబులెన్స్‌లో, మరో ఇద్దరిని ఆటో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

నర్వ: మక్తల్ మండలం పంచలింగాల్ నుంచి చెరుకు లోడుతో వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమయ్య తెలిపిన వివరాలు ఇలా.. పంచలింగాల్ నుంచి చెరుకు లోడుతో కొత్తకోటలోని అప్పరాల వద్ద కృష్ణవేణి చక్కెర ఫ్యాక్టరీకి వెళ్తుండగా మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద ప్రమాదవశాత్తు కుడి వైపున ఉన్న గుంతలో పడింది. ట్రాక్టర్ డ్రైవర్ అజయ్ యశ్వంత్ కాంబ్లీ (32) చాతిపై స్టీరింగ్ నొక్కి, చెరుకు గడలు మీదపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మజ్‌గావ్ గ్రామం, బీడ్ జిల్లా, మహారాష్ట్రకు చెందిన వాడని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని మహిళ..

పెబ్బేరు రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44పై బాలాజీ దాభా వద్ద శక్రవారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైనట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన చిన్న వెంకటస్వామి, భార్య రేణుకాదేవి, అల్లుడు రాజు కలిసి గద్వాల నుంచి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో పెబ్బేరు బాలాజీదాభా వద్ద తమిళనాడుకు చెందిన లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. కారు పల్టీలు కొట్టడంతో అందులో ఉన్న రేణుకాదేవి (52) అక్కడికక్కడే మృతి చెందింది. చిన్న వెంకటస్వామికి కాలు విరగగా, రాజుకు గాయాలయ్యాయి. అల్లుడు రాజు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు

- నేడు అలంకారోత్సవం
- కనుల పండువగా సాగనున్న ఆభరణాల ఊరేగింపు



స్వామివారి ఆభరణాలు



చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అలంకారోత్సవం నిర్వహించనున్నారు. అత్యంత వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని ఎస్‌బీఐ లాకర్‌లో భద్రపరిచిన స్వామివారి ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యనగాడి వంశస్తులు తలపై పెట్టుకుని ఆత్మకూర్ చెరువుకట్ట వరకు తీసుకురానున్నారు. అక్కడ శివుడికి పూజల అనంతరం మదనాపురం మండలం కొత్తపల్లి, దుప్పల్లి, గ్రామాల మీదుగా చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలోని రాజ శ్రీరాంభూపాల్ ఇంటికి చేరుస్తారు. అక్కడ ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మాపురం నుంచి నంభి వంశస్తులు ఆభరణాలను తలపై పెట్టుకుని అంభోరు మధ్యన కాలినడకన కురుమూర్తి కొండలకు చేరుస్తారు. ఈ కార్యక్రమం కనుల పండువగా సాగుతుంది. కాంచనగుహలో కొలువుదీరిన స్వామికి కిరీటం, హస్తాలు, పాదుకలు, కోర మీసాలు, కెంపు, ముత్యాలహారం, కనక హారాలతో పాటు పలు రకాల ఆభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు.

ఆభరణాల చరిత్ర..

పాలమూరు జిల్లాలో అతి పురాతన క్షేత్రంగా కురుమూర్తి పేరొందింది. క్రీ.శ.1265లో స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. కురుమూర్తి కొండలు దట్టమైన అడవిలో ఉండేవి. దీనివల్ల పగటిపూటే భక్తులు దర్శనానికి వచ్చేవారు. దొంగల బెడద, అడవిలో క్రూరమృగాల భయం ఉండేది. దీంతో స్వామివారి ఆభరణాలకు రక్షణ ఉండదనే ఉద్దేశంతో బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే వాటిని స్వామి వారికి అలంకరించేవారు. మిగతా సమయంలో అమ్మాపురం ముక్కెర వంశపు రాజుల కోటలో భద్రపరిచేవారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆభరణాలను అమ్మాపురం కోట నుంచి ఏనుగులపై స్వామివారి ఆలయానికి తీసుకెళ్లేవారు. అప్పటినుంచి అదే ఆనవాయితీ కొనసాగుతోంది. ఆ తరువాత వచ్చిన రాజులు మూడవ తిమ్మారెడ్డి, ఆయన వంశీయులు సోంభూపాల్, సీతారాంభూపాల్, శ్రీరాంభూపాల్, మాజీ ఎమ్మెల్యే సోంభూపాల్ వరకు కొనసాగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ బ్యాంకులు రావడంతో బ్రహ్మోత్సవాల అనంతరం ఆభరణాలను బ్యాంకు లాకర్‌లో భద్రపరుస్తున్నారు.

క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు

పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్



మాట్లాడుతున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

గద్వాల: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీంతోనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తెలిపారు. 67వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి అండర్–14 బాలుర ఫుట్‌బాల్ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక సోమనాద్రి స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశంలో వీసీ మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాలనే తలంపుతో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియాలను నిర్మించిందన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకుని ఆడాలని సూచించారు. డీఈఓ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, అప్పుడే ఏ క్రీడలనైనా రాణించవచ్చన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ధృఢత్వం లభిస్తుందని చెప్పారు. క్రీడలలో రాణించే వారిని దేశ హీరోలుగా కొలుస్తారన్నారు. డీవైఎస్‌ఓ ఆనంద్ మాట్లాడుతూ క్రీడలు ఔన్నత్యాన్ని చాటుతాయని చెప్పారు. గద్వాలను క్రీడాకేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. అంతకు ముందు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ వీసీ గౌరవ వందనం స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఎంఈఓ సురేష్, బాలరాజుగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన పోటీలు..

బాలుర ఫుట్‌బాల్ పోటీలు మొదటి రోజు ఉత్సాహంగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్లకు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలను నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో మెదక్, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. రెండు గోల్స్ చేసి హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. అనంతరం మెదక్– నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లో మెదక్ విజయం సాధించింది. హైదరాబాద్– అదిలాబాద్ మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. నిజామాబాద్ – నల్లగొండ మ్యాచ్‌లో రెండు గోల్స్ తేడాతో నల్లగొండ విజయం సాధించింది. తదనంతరం మెదక్– నల్లగొండ జట్ల మధ్య మ్యాచ్‌లో నల్లగొండ జట్టు నెగ్గింది. వరంగల్‌పై మూడు గోల్స్ తేడాతో ఖమ్మం జట్టు విజయం సాధించింది. అనంతరం మహబూబ్‌నగర్ – కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. కరీంనగర్‌పై రంగారెడ్డి జట్టు గెలుపొందిందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

కొత్తపల్లిలో చిరుత కలకలం

- మేకను తిని వాగులోని పొదల్లో దాగిన చిరుత
- పరిశీలించిన అటవీశాఖ అధికారులు



వాగులోని పొదల్లో నిద్రిస్తున్న చిరుత

కోస్గి: మండలంలోని కొత్తపల్లిలో చిరుత కలకలం రేపింది. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని వాగులో ఉన్న పొదల్లో చిరుతను గమనించిన రైతులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు తెలపడంతో అధికారులు వచ్చి పరిశీలించారు. చీకటిగా ఉండటంతోపాటు మేకను తిని మత్తులో ఉన్న చిరుతను నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు శనివారం ఉదయం అక్కడే ఉంటే పట్టుకుంటామని, అప్పటి వరకు గ్రామస్తులు ఆ ప్రాంతం వద్దకు వెళ్లకూడదని చెప్పి వెళ్లిపోయారు. కాగా చీకటిగా ఉండటంతోపాటు ముళ్ల పొదల్లో మత్తుగా ఉన్న చిరుతను పట్టుకోవడం సాధ్యం కాలేదని, ఉదయం అక్కడే ఉంటే చిరుతను బంధిస్తామని అటవీ శాఖ డిస్టిక్ రేంజ్ ఆఫీసర్ నారాయణరావు తెలిపారు.

నెట్టెంపాడు ఎతిపోతల నీటి పంపింగ్ ప్రారంభం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు. శుక్రవారం ప్రాజెక్టుకు 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 90, భీమా లిఫ్టు–1కు 650, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.319 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



దేవరకద్ర/జడ్చర్ల: దేవరకద్రలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చిన ధాన్యంతో పోటెత్తింది. మార్కెట్ యార్డులోని ఆవరణ, షెడ్లు, సీసీరోడ్లు ధాన్యం రాసులతో నిండిపోయాయి. వానాకాలం సీజన్ కింద పండించిన వరిధాన్యం కోతలు కోస్తుండడంతో రైతులు పెద్దఎత్తున మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చారు. దాదాపు 12 వేల బస్తాల ధాన్యం మార్కెట్‌కు వచ్చింది. ఇదిలా ఉండగా ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,489, కనిష్టంగా రూ.2,150 ధరలు నమోదయ్యాయి. అలాగే హంసకు గరిష్టంగా రూ.1,889, కనిష్టంగా రూ.1,709 ధరలు వచ్చాయి.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటా రూ.2,801

బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం క్వింటాల్ గరిష్టంగా రూ.2,801, కనిష్టంగా రూ.1,946 ధర లభించింది. అలాగే హంసకు గరిష్టంగా రూ.2,069, కనిష్టంగా రూ.1,667, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,355, కనిష్టంగా రూ.2.077 ధరలు వచ్చాయి.

మూడు నెలల్లోనే ప్రజావ్యతిరేకత

పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మాట్లాడుతున్న రాఘవాచారి

వనపర్తిటౌన్: బస్సులు, మార్కెట్‌ల నుంచి మొదలుకొని ఎక్కడ చూసిన ప్రభుత్వం మారిపోతుందని చెబుతున్నారని, మూడు నెలల్లోనే ప్రజావ్యతిరేకత బయటపడిందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్త్ తెలంగాణకు ఇస్తున్న ప్రాధాన్యత సౌత్‌కు ఇవ్వడం లేదని, రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి, రూ.20వేల కోట్లు పాలమూరుకు ఖర్చు పెట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రాజెక్టును 30 శాతం పనులు పూర్తి చేసి మొత్తం అయిపోయిందని సీఎం ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు నీళ్లు తేలేదు, పాత స్కీంలు పూర్తి చేయలేదు, ఆయకట్టు నిర్ధారించలేదన్నారు. గత ప్రభుత్వాల్లో లేని విధంగా ప్రస్తుత అభ్యర్థుల స్థిర, చర ఆదాయాలు విపరీతంగా పెరిగాయని, ఉద్యమ లక్ష్యం అభ్యర్థులు బలిసిపోవడమే అన్నట్లుగా మారిందన్నారు. మైనింగ్‌ను కూడా అభివృద్ధి అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు చేసేవాళ్లకు వ్యాపారాలు ఎందుకని, వ్యాపారాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావొద్దన్నారు. సంక్షేమ పథకాలు యధాస్థితిని కొనసాగిస్తాయని, సంక్షేమ పథకాలు హక్కుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఉపా చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టానికి బీజేపీ కోరలు తొడిగిందన్నారు. పాలమూరులోని నిర్వాసితులకు 2013 చట్టం వర్తించకపోవడంతో న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ, అమర్ రాజా కంపెనీలను ప్రోత్సహించే వారికి ఓట్లు వేయొద్దన్నారు. ఆ ఫ్యాక్టరీల్లోని కాలుష్యం కృష్ణతీరంలో కలవడంతో పశుపక్షాదులే కాకుండా ప్రజల జీవితాలపై ప్రభావం పడుతుందన్నారు. సమావేశంలో భద్రసేనయ్య, వెంకటేశ్వర్ శెట్టి, యోసేపు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.